ప్రజాశక్తి

బుధవారం 30 అక్టోబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పాల సేకరణ ధర పెంచకుంటే..

తాడోపేడో తేల్చుకుంటాం

విశాఖ డెయిరీ మెయిన్ గేట్ వద్ద మహాధర్నాలో నాయకులు, పాడి రైతుల హెచ్చరిక

మహాధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, గాజువాక : తగ్గించిన పాల సేకరణ ధరను పెంచకుంటే తాడోపేడో తేల్చుకుంటామని పాల రైతు సంఘాల నాయకులు, పాడి రైతులు విశాఖ డెయిరీ యాజమాన్యాన్ని హెచ్చరించారు. పాల సేకరణ ధరను విశాఖ డెయిరీ యాజమాన్యం కొద్ది రోజుల క్రితం తగ్గించడంపై పాల రైతులు మంగళవారం భగ్గుమన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వారంతా విశాఖ నగరంలోని గాజువాకకు సమీపంలో ఉన్న డెయిరీ వద్దకు తరలివచ్చి ప్రధాన ద్వారం వద్ద మహాధర్నా నిర్వహించారు. నవంబర్ 1న చెల్లించే పేమెంట్లలో రైతుల డిమాండ్‌కు అనుగుణంగా ధరను పెంచి ఇవ్వకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ పాలు రైతుల సంఘం (అఖిల భారత కిసాన్ సభ అనుబంధం) ఆధ్వర్యాన ఈ కార్యక్రమం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సాగింది. తొలుత సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ఆవుపాల సేకరణ ధరను డెయిరీ యాజమాన్యం లీటరుకు రూ.3 మేర తగ్గించడం దారుణమన్నారు. ఆవు పాల రైతులకు లీటర్‌కు రూ.50, గేదె పాలకు రూ.80 ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల ధరను తక్షణం పునరుద్ధరించాలన్నారు. పాల సేకరణ ధర విషయమై యాజమాన్యం తరపున ఎమ్‌డి వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వ్యవసాయం కుదేలైందని అన్నారు. ఉత్తరాంధ్రలో ప్రస్తుతం మిగతా 2లో..

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంత్రి నారాయణ నుంచి అవార్డు స్వీకరిస్తున్న జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్

పిఎం స్వనిధి అమలులో

జివిఎంసికి రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జివిఎంసి) 2023-24 సంవత్సరానికిగానూ పిఎం స్వనిధి పథకాన్ని అమలు పరచడంలో ఉత్తమంగా నిలిచి రాష్ట్రస్థాయి అవార్డు దక్కించుకుంది. ఈ అవార్డును రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ చేతులమీదుగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అందుకున్నారు. జివిఎంసి పరిధిలో పిఎం స్వనిధి పథకంలో ప్రజలకు రుణాలు మంజూరు చేసేందుకుగాను 20697 దరఖాస్తులు మూడు దశల్లో రిజిస్టర్ అయ్యాయని, వాటిని అమలు పరచడంలో యుసిడి విభాగం అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక కృషి చేశారని యుసిడి పీడీ సత్యవేణి తెలిపారు. కార్యక్రమంలో మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నుంచి పలు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే విశాఖపట్నం - దానాపూర్ - విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైలును నడపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08520 విశాఖపట్నం - దానాపూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 4 సోమవారం ఉదయం 9:10 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు మంగళవారం ఉదయం 11:00 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. 08519 దానాపూర్ -విశాఖపట్నం స్పెషల్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ మిగతా 2లో..

ఎక్సైజ్ శాఖ లేబొరేటరీ పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీలోని ఎక్సైజ్ శాఖ లేబొరేటరీని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. గ్యాస్ క్రోమోటోగ్రఫీ, అటమిక్ అబ్‌జాప్షన్ స్పెక్ట్రో స్కోపీ, హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రమోటోగ్రఫీ యంత్రాల పని తీరును గమనించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మద్యాన్ని తొమ్మిది రకాలుగా పరీక్షిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత పాలనలో ఎలాంటి పరీక్షలూ చేయకుండా ప్రజలపై మద్యాన్ని రుద్ది వారి ప్రాణాలు తీశారని తెలిపారు. ఆయన వెంట విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ ఉన్నారు.

విశాఖలో భూముల వేలం నిలిపేయండి

వార్త 2లో..

వైసిపి హయాంలో మైనింగ్ దోపిడీ

వార్త 8లో..

మాట్లాడుతున్న మంత్రి సుభాష్

అచ్యుతాపురంలో ఇఎస్ఐ ఆసుపత్రికి శంకుస్థాపన

వార్త మెయిన్‌లో..

మొదటి పేజీ తరువాయి..

తాడోపేడో తేల్చుకుంటాం

మూడు లక్షల మంది పాడి రైతులు పాలు అమ్ముకుని జీవిస్తున్నారని, వారికి అన్యాయం చేయడం తగదని అన్నారు. డెయిరీని కంపెనీ యాక్ట్‌లోకి మార్చిన తర్వాత రైతులకు ఒక పైసా కూడా ఇవ్వడం లేదన్నారు. డెయిరీకి వచ్చిన లాభాలన్నీ వారి జేబు సంస్థలకు వెళ్తున్నాయని చెప్పారు. కోట్ల రూపాయలు ఎలా దారి మళ్లుతున్నాయో వివరించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ విశాఖ డెయిరీకి వచ్చిన లాభాలు ప్రైవేటుగా దారి మళ్లుతున్నాయన్నారు. కొంతమందికి సొంత జాగీరుగా డెయిరీ మారిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం కార్యదర్శి కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ స్థిరాస్తులను కాజేయడానికి కుట్ర చేస్తున్నారని తెలిపారు. సహకార నిబంధనల ప్రకారం లాభాల్లో నుంచి బోనస్‌ను 2006వ సంవత్సరం నుండి రైతులకు చెల్లించడం లేదని అన్నారు. పాల రైతుల సొసైటీలతో చర్చించకుండా ఏకపక్షంగా పాల ధర తగ్గించడం సరికాదన్నారు. సహకార స్ఫూర్తికే ఇది విరుద్ధమన్నారు. ఇక్కడ ఆవులు, గేదెలకు సంబంధించిన హాస్పిటల్ లేదన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ డెయిరీ పాల రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. మహిళా రైతు బొప్పెర గౌరి మాట్లాడుతూ ధర తగ్గించడం సరికాదన్నారు. మరో మహిళా రైతు చీపురుపల్లి కుమారి మాట్లాడుతూ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు క్రిం అప్పారావు, గండి నాయనబాబు, ఎస్.బ్రహ్మాజీ, ఎం.అప్పలరాజు, వెలమల రమణ, జగన్, ఆర్.రమణమూర్తి, రాంబాబు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నుంచి పలు ప్రత్యేక రైళ్లు

5 మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు దానాపూర్ నుంచి బయలుదేరి మరుసటిరోజు బుధవారం మధ్యాహ్నం 15:45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్ళ సింహాచలం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, బాలుగావ్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్‌కియోంజర్ రోడ్, భద్రక్, బాలాసోర్, హిజ్లీ, మిడ్నాపూర్, బంకురా, అద్రా, అస్సోల్, చిత్తరంజన్, మధుపూర్, జసిద్హి మీదుగా ప్రయాణిస్తాయి.

అలాగే 08536 విశాఖపట్నం – భువనేశ్వర్ జనసాధారణ ప్రత్యేక రైలు అక్టోబర్ 29 నుంచి నవంబర్ 15 వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 12:00 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 19:45 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. 08535 భువనేశ్వర్ – విశాఖపట్నం జనసాధారణ ప్రత్యేక రైలు అక్టోబర్ 29 నుండి నవంబర్ 15 వరకు ప్రతి రోజు రాత్రి 22:30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 08:45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్ళు సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు, శ్రీకాకుళం రోడ్డు, నౌపడ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, బ్రహ్మపూర్, ఛత్రపూర్, బాలుగావ్, ఖుర్దా రోడ్డు మీదుగా ప్రయాణిస్తాయని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

వికసిత్ భారత్‌లో యువత భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : వికసిత్ భారత్ రూపకల్పనలో యువత భాగస్వామ్యం కావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. విశాఖపట్నం డివిజన్ తపాలా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సిరిపురంలోని వియంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఏరీనాలో రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. తొలుత ఈ మేళాను ఉద్దేశించి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో మాట్లాడారు. అనంతరం బండి సంజయ్ చిల్డ్రన్స్ ఏరీనాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఉపాధి కల్పనలో పారదర్శకత పాటిస్తూ, రాజకీయ జోక్యానికి, సిఫార్సులకు ఆస్కారం లేకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నామన్నారు. రోజ్‌గార్ మేళా ఉద్దేశాన్ని తెలియజేశారు. అనంతరం విశాఖపట్నంలో వివిధ ప్రభుత్వ విభాగాలలో ఉద్యోగాలు సాధించిన 110 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీ భరత్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కర్నూల్ రీజియన్ తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ వెన్నం ఉపేంద్ర, విశాఖపట్నం డివిజన్ తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్ర కుమార్ మీనా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పేరిట మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : ఇళ్లు ఇస్తామని చెప్పి, డబ్బులు వసూలు చేసిన వైసిపి నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం అక్కయ్యపాలెం జోన్ కార్యదర్శి యుఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ టౌన్ రంగిరీజు వీధికి చెందిన వైసిపి మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు కుమారుడు కొప్పుల శ్రీరామ్ తాటిచెట్లపాలెం ఎన్ఎఆర్ నగర్‌కు చెందిన పేదలు వద్ద సుమారు రూ.40 లక్షలను వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు తీసుకొని మోసం చేశారన్నారు. డబ్బులు ఇచ్చిన నిరుపేదలకు నేటికీ గృహాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.అప్పలరాజు, పి.గౌరీష్, శోభ, సుశీల, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : అనంతపురంలోని ఆర్‌డిటి గ్రౌండ్‌లో నవంబర్ 15 నుంచి 19 వరకు నేషనల్ ఫుట్‌బాల్ సంతోష్ ట్రోఫీని నిర్వహిస్తున్నట్లు ఫుట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోటగిరి శ్రీధర్, జిల్లా కార్యదర్శి అక్కరమాని చినబాబు తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఫుట్‌బాల్ క్రీడ అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని తెలిపారు. తమపై లేనిపోని ఆరోపణలు కొందరు చేస్తున్నారని, వాటిని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు ముని శ్రీనివాస్, రాజారావు, కోచ్ శేషుబాబు, మాణిక్యం, సన్యాసిరావు పాల్గొన్నారు.

భూముల వేలం నిలిపేయండి

విశాఖను అదానీపరం చేయొద్దు
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం, మధురవాడ, కూర్మన్నపాలెం, చినముషిడివాడల్లో ఉన్న భూములను వియంఆర్‌డిఏ ద్వారా వేలం వేయడాన్ని తక్షణం నిలుపుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కారదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. మంగళవారం జగదాంబ వద్దగల పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భూములను భక్షించే పనికి పూనుకోవడం దారుణమన్నారు. విశాఖపట్నం ప్రయోజనాలు కాపాడే వారైతే విద్యాసంస్థల భూములను అమ్మకానికి పెట్టేవారు కాదన్నారు. కూటమి ప్రభుత్వం విశాఖను ఆర్థిక రాజధాని చేస్తానని అంటోందని, వాస్తవానికి ప్రభుత్వ భూములన్నీ అమ్మేసి అదానీ రాజధానిగా మారుస్తోందని విమర్శించారు. వియంఆర్‌డిఏను భూములు అమ్మే సంస్థగా మార్చేడం సరైంది కాదన్నారు. తక్షణమే భూముల వేలాన్ని నిలుపుదల చేయాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ భూములను అదానీపరం చేయడానికి చంద్రబాబు కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున ఒప్పందాలు చేసుకున్నట్లుగా కనిపిస్తోం దన్నారు. అదానీతో చేసిన చర్చల్లో ఈ ఒప్పందం జరిగిందన్నారు. దీనిని చంద్రబాబు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అదానీ గంగవరం పోర్టు విస్తరణ కోసం 250 ఎకరాల భూమి అవసరమని చంద్రబాబునాయుడును కోరినట్టు తెలిసిందని, కానీ దీనికి 2 వేల ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు వార్తలొస్తున్నాయని తెలిపారు. మోడీ ఆదేశాలు చకచకా ఇక్కడ అమలవుతున్నాయన్నారు. అప్పికొండ వద్ద డీసాలినేషన్ ప్లాంట్ విషయమై 25 ఎంజిడిఎల నీటిని శుద్ధిచేసే ప్లాంట్‌ను అదానీకి కట్టబెట్టారన్నారు. దీని వల్ల జివిఎంసికి రూ.200 ఆదాయం నష్టం వస్తుందని తెలిపారు. జివిఎంసి కౌన్సిల్ ఆమోదం లేకుండా చంద్రబాబు ఏకపక్షంగా ఇవ్వడాన్ని సిపిఎం ఖండిస్తోందన్నారు. రుషికొండ వద్ద ఉన్న విల్లాను అదానీకి కట్టబెట్టేందుకు పూనుకుంటున్నారన్నారు. దీనిని పర్యాటకానికి, ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పులే ఈ ప్రభుత్వం చేస్తే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. భూముల రక్షణ కోసం ప్రజల్లోకి సిపిఎం వెళ్లి ప్రజలను చైతన్యపరిచి ఉద్యమానికి శ్రీకారం చుడుతుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : ఆంధ్రా వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 25, 26, 27 తేదీలలో సొంత్యాంలోని అకాడమీ ఫర్ క్రికెట్ ఎక్సలెన్స్ మైదానంలో తలపెట్టిన పోటీల్లో విజయవాడ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. పోటీల్లో వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, విజయవాడ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్, బిగ్‌మాన్ క్రికెటర్ అసోసియేషన్, మెన్ అండ్ బ్లూ వైజాగ్ జట్టు పాల్గొన్నట్టు వెల్లడించారు. విజేతగా విజయవాడ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ నిలువగా, రెండో స్థానంలో మెన్ ఇన్ బ్లూ వైజాగ్ నిలిచినట్టు చెప్పారు. విజేతగా నిలిచిన విజయవాడ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ జట్టు సారథి ఐ.పెంచలయ్యకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ రీజియన్ – 2 చీఫ్ మేనేజర్ రామకృష్ణ చేతుల మీదుగా ట్రోఫీని ప్రదానం చేశారు. అదేవిధంగా రెండో స్థానంలో నిలిచిన మెన్ బ్లూ వైజాగ్ టీం సారథి వి.శ్రీనివాస్‌కు సొంత్యాం గ్రౌండ్స్ ఓనర్ యోగేష్ చేతుల మీదుగా రన్నర్స్ ట్రోఫీని అందజేశారు. ఈ పోటీలలో ఉత్తమ బాట్స్‌మ్యాన్‌గా బిగ్‌మాన్ క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన సంజయ్ సురేష్, ఉత్తమ బౌలర్‌గా విజయవాడ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ జట్టుకు చెందిన సి.హెచ్ సందీప్ ఎంపికయ్యారు. ఈ ముగింపు కార్యక్రమంలో ఆంధ్ర వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ వి.శ్రీనివాస్, సభ్యులు ఎ.రామ్ శంకర్, కాలువ ప్రసాద్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ కార్యాలయం వద్ద ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి.తులసీరామ్ మాట్లాడుతూ 2020 తర్వాత రిటైర్ అయిన వారికి రావలసిన డబ్బులు వెంటనే ఇవ్వాలన్నారు. రిటైర్ అయిన వారికి కనీస పెన్షన్ రూ.1000 మాత్రమే ఇస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వారికి వర్తించే విధంగా చూడాలని కోరారు. అనంతరం ఇన్‌ఛార్జి ఆర్‌టిసి జిల్లా మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఇఎస్.నారాయణ, ఎస్.తాజుద్దీన్, ఎస్.జగదీష్, వీరభద్రరావు, జోషీబాబు పాల్గొన్నారు.

ఫలితంలేని విచారణ.. అబద్ధాలతో వివరణ

హోం మంత్రి అనిత నియోజకవర్గంలో
వసతి గృహం దుస్థితిపై అధికారులకు కానరాని వాస్తవాలు

ప్రజాశక్తి–అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలోని నక్కపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలోని అసౌకర్యాలను గుర్తించి నివేదించడానికి విచారణాధికారులకు ధైర్యంచాలినట్లులేదు. అబద్ధంతో నిజం దాచేయాలని చూస్తున్నారో, అసత్యాలు, అర్ధ సత్యాలతో వాస్తవాల్ని మరుగునపడేయాలని చూస్తున్నారో తెలిదుగానీ వసతి గృహ సమస్యలను సంపూర్ణంగా వెల్లడించలేదు. 'ఆరు గదులకు ఒకటే ఫ్యాన్' శీర్షికన ఈ నెల 26న ప్రజాశక్తి టాబ్లాయిడ్ మొదటి పేజీలో కథనం వచ్చింది. ఈ కథనంపై అదే రోజు పాయకరావుపేట ఎఎస్‌డబ్ల్యుఒ, ఇతర శాఖల ఉద్యోగులతో కలిసి జిల్లా ఎస్‌సి సంక్షేమశాఖాధికారి కె.రాజేశ్వరి విచారణ కోసం వసతి గృహానికి వెళ్లినట్లు ప్రజాశక్తికి ఇచ్చిన వివరణలో పేర్కొన్నారు. 'పది స్నానపు గదులు, పది మరుగుదొడ్లు పైప్‌లైన్ వైఫల్యం కారణంగా ఇటీవల పనిచేయడంలేదు. బోర్డర్ల లివింగ్ గదులు మూడింటిలోవున్న తొమ్మిది ఫ్యాన్లలో ఆరు ఫ్యాన్లు పనిచేస్తున్నాయి' అని పేర్కొన్నారు. 40 మంది విద్యార్థులున్న పెద్ద గదిలో ఫ్యాన్లు పనిచేయకపోవడంతో, పక్కన ఒక లైట్, ఒక ఫ్యాన్‌వున్న గదిలో రాత్రిపూట సర్దుకొని పడుకుంటున్న వాస్తవాన్ని చెప్ప నిరాకరించారు. ఐదు నుంచి పది తరగతుల విద్యార్థుల వసతి గృహంలోని ఆరు గదుల్లో ఒక గదిలో ఫ్యాన్, బల్బు పనిచేయడంతో కేటాయించిన గదులు వదిలి ఫ్యాన్ వున్న గదికి విద్యార్థులు రాత్రిపూట వెళ్తున్నారు. వర్షాలకు గదుల్లో నీరు చిమ్ముతున్న విషయం, ఏ ఒక్క స్నానపు గదికి తలుపులేని వాస్తవం, స్నానాలకు సరిపడా నీరులేక పైనున్న ట్యాంకునీరు పట్టుకొని స్నానాలు చేస్తున్న సమస్యనూ చెప్పే ప్రయత్నం చేయలేదు. భోజన గదిలేక వరండాలో, వర్షం పడితే గదుల్లో తింటున్న అసౌకర్యమూ వివరించలేదు. పైపులైన్లే కాదు, పది మరుగుదొడ్లలో నాలుగు మరుగుదొడ్లకు తలుపుల్లేవు. కొంతభాగం ప్రహరీగోడలేని విషయాన్నీ ఆ వివరణలో పొందుపర్చకపోవడం గమనార్హం. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలోని ఈ వసతి గృహంలో విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపడేలా అధికారులు నివేదిక సమర్పిస్తే కొంతైనా విచారణకు ఫలితం వుంటుంది.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE (SENIOR DIVISION) : AT GAJUWAKA
O.S.No. 6 / 2024

Between:
Sri Duba Ratna Kumar ... Plaintiff
And:
1. Sri Adapa Prasad
2. Sri Chinnam Veera Raghava Reddy
3. Tethala Harika Urmila Devi
... Defendants

NOTICE

To
The Defendant No.1
Sri Adapa Prasad,
S/o. Adapa Appala Raju, Hindu, aged 33 years, Resident of D.No. 54-11-15/1, Ishukathota, H.B.Colony Post, Visakhapatnam.

పై పైకేసులో మీకు పలుమార్లు శ్రీకోర్టు వారి ద్వారా మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా నోటీసులను పంపినను వాటిల్ని ఉద్దేశ పూర్వకముగా తీసుకొనక, పై కేసు విషయం తెలిసి కూడా శ్రీకోర్టు వారి ముందు హాజరుకాక పోవుటచే శ్రీకోర్టు వారు మీకు కోర్టు నోటీసును ఈ పత్రిక ప్రకటనద్వారా తెలియజేయమని ఆర్డరు వేసి మీ హాజరీ కొరకు తేది:7-11-2024 నాటికి వాయిదా అయివున్నది. కావున మీరు ఆదినమున శ్రీకోర్టువారి ముందు ఉదయం 10 గంటలకు మీకు మీరుగానిగాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలను అభ్యంతరములను వున్నయెడల శ్రీకోర్టు వారికి తెల్పికొనవచ్చును లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానము అగునని యిందు మూలంగా శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు తెలియజేయడమైనది.

(By the Order of the Court)
D.SURESH KUMAR,
D.(Ch) RENUKA DEVI
Advocates, Visakhapatnam.
Cell : 9848087464

గంభీరం గెడ్డ వాగులో అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం గ్రామపంచాయతీ పరిధి సర్వేనెంబర్ 173లో విద్యుత్ ఆఫీస్ ప్రహరీకి ఆనుకొని ఉన్న గెడ్డ వాగులో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. వర్షాధార ప్రభుత్వ వాగును కూడా ఆక్రమణదారులు వదలడం లేదు. వాగులో మట్టితో పూర్తిస్థాయిలో కప్పేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఆనందపురం మండలంలో భూమి రేట్లు పెరిగిపోవడంతో గెడ్డలను సైతం వదలకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టించుకోవలసిన అధికారులు చోద్యం చూస్తున్నారు. బొడ్డపాలెం గంభీరం బీసీ కాలనీ నుంచి వచ్చే వర్షపు నీరు పోవడానికి సుమారు మూడు ఎకరాల పైనే గెడ్డవాగు ఉంది. ఈ గెడ్డ ద్వారా వర్షపు నీరు గంభీరం గెడ్డలో కలుస్తుంది. గెడ్డలను ఆక్రమిస్తే చేసి వర్షపు నీరు పోవడానికి మార్గం లేక భవిష్యత్తు తరాలకు పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. గెడ్డలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాలని, అవి ఆక్రమణ కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక విఆర్ఒ రంభను వివరణ కోరగా పూర్తిస్థాయిలో విచారణ జరిపి తహశీల్దార్‌కు నివేదిస్తామని చెప్పారు.

గెడ్డవాగులో అక్రమ నిర్మాణం

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్, రాజేశ్వరరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ బాలోత్సవాలను నవంబరు 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి పోస్టర్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఇఒ ప్రేమ్‌కుమార్ ద్వారా ఆవిష్కరించి ఆయనకు ఉత్సవ వివరాలను వివరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ, నగరంలోని సెయింట్ ఆంథోని ప్రైమరీ స్కూల్లో ఈ బాలోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్కూళ్లకు వెళ్లి పోటీల వివరాలున్న సెట్లను అందించామన్నారు. నవంబరు 9వ తేదీ లోగా ఎంట్రీలను బాలోత్సవ కేంద్రానికి అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను కోరామని చెప్పారు. పెందుర్తి నుంచి ఎన్ఎడి కొత్త రోడ్డు వరకు ఉన్న పాఠశాలల నుంచి గరిష్టమైన స్పందన వచ్చే విధంగా జిల్లా విద్యాశాఖాధికారి సమాచారం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం అధ్యక్షులు పి.రఘు, సభ్యులు ఎం.ఎల్లాజీ, సిహెచ్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : సోషలిస్టు దేశం క్యూబాపై అమెరికా పెట్టిన ఆంక్షలు దుర్మార్గమని, తక్షణం ఆంక్షలు ఎత్తివేయాలని సిపిఎం సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్ చేశారు. క్యూబాపై అమెరికా ఆంక్షలకు నిరసనగా మంగళవారం పూర్ణా మార్కెట్ స్ప్రింగ్ రోడ్‌లో పార్టీ జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. క్యూబాలో ప్రత్యేక పరిస్థితుల కారణంగా మందులు, ఆహార పదార్థాలు, పెట్రోలు వంటివి విదేశాల నుంచి కొనుక్కునే పరిస్థితి ఉందన్నారు. ఆ స్థితిలో ఆ దేశానికి సరుకులు అందకుండా అమెరికా ఆంక్షలు పెట్టడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.చంద్రశేఖర్, ముఠా కళాసీల నాయకులు టి.పైడిరాజు, సిఐటియు నాయకులు కెవిపి.చంద్రమౌళి, సంతోష్ పాల్గొన్నారు.

ములగాడ : క్యూబాపై అమెరికా ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన శ్రీహరిపురం వద్ద నిరసన తెలిపారు. సిఐటియు జోన్ అధ్యక్షులు కె.పెంటారావు అధ్యక్షతన జరిగిన ఈ

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

కార్యక్రమంలో 'క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలి, అమెరికా సామ్రాజ్య వాదం నశించాలి, క్యూబా ప్రజలకు సంఘీబావం తెల్పండి, సోషలిజం వర్ధిల్లాలి' నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, జివిఎంసి, ముఠా పెన్షనర్ల నాయకులు కె.నూకరాజు, జానీ పి.పైడిరాజు, జివిఎంసి నాయకులు కె.రమణ, డి.రాము, సూరిబాబు, బి.రాంబాబు, రవణ, సిఐటియు నాయకులు ఎం.కోటి, కె.కృష్ణ, బి.శ్రీను, అప్పలనాయుడు, జి.రమణ తదితర్లు పాల్గొన్నారు.

నారాయణరావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపిలో అనేక పదవులు నిర్వహించడమే గాకుండా మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, అప్పటి పుడా డైరెక్టర్‌గా పదవులు నిర్వహించి వన్నె తెచ్చిన మొకర నారాయణరావు సేవలు మరువలేనివని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూక రాజు కొనియాడారు. నారాయణరావు జయంతిని మంగళవారం భీమిలిలో నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణరావుకు నివాళులర్పించిన వారిలో పార్టీ నాయకులు కె.నాగరాజు, కొక్కిరి అప్పన్న, వి సత్యారావు, గండిబోయిన పోలిరాజు, దొకర అప్పలనారాయణ, కుటుంబ సభ్యులు కెఎస్ఆర్ కృష్ణారావు, కె.సన్యాసినాయుడు, పూర్వ ఎన్‌జిఒ సంఘం నాయకులు కె.ముత్యాలరావు తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కళా సాహితీ సంస్థ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. స్థానిక పెన్షనర్ల్లో నిర్వహించిన సమావేశంలో రెండేళ్ల కాలపరిమితితో కూడిన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవాధ్యక్షులుగా ఆర్.అప్పలనరసయ్య, అధ్యక్షులుగా పి.రాజేంద్రప్రసాద్‌వర్మ, ప్రధాన కార్యదర్శిగా ఎ.సన్యాసిరాజు, కోశాధికారిగా కాళ్ల సన్నీ, ఉపాధ్యక్షులుగా కె.రామానాయుడు, ఎం.కోటయ్య, పిట్ట సురేష్ తదితరులు ఎన్నికైన వారిలో ఉన్నారు.

11వ వార్డులో టిడిపి సభ్యత్వం నమోదు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు పరిధి బాలాజీనగర్‌లో వార్డు టిడిపి నాయకులు రాగతి అచ్యుతరావు, ముగడ రాజారావు ఆధ్వర్యాన మంగళవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేపట్టారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేయించారు. కార్యక్రమంలో మూది అప్పారావు, ఎం.కృష్ణంరాజు పాల్గొన్నారు.

ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి -మధురవాడ : అంబేద్కర్ గురుకులం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రెండు రోజులు నుంచి జరుగుతున్న ఎగ్జిబిషన్ మంగళవారం ముగిసింది. ఉత్తరాంధ్ర ఉమ్మడి మూడు జిల్లాల నుంచి 33 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉత్తరాంధ్ర మూడు జిల్లాల కో-ఆర్డినేటర్ల ఆధ్వర్యాన విశాఖపట్నం జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో కార్యక్రమం ముగిసింది. ముగింపు సమావేశంలో విశాఖపట్నం జిల్లా డిసిఒ రూపావతి మాట్లాడుతూ, విద్యార్థులందరి ప్రదర్శనలు చాలా బాగున్నాయని, అన్నింటిలో ఉత్తమమైన వాటిని నిష్పక్షపాతంగా ఎంపికచేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐ సొసైటీ జాయింట్ సెక్రటరీ ఎ.మురళీకృష్ణ, పి.మురళీధర్, ఎన్.బాలాజీ హాజరై విద్యార్థులకు బహుమతులు అందించారు.

స్వామికి పవిత్రాలు సమర్పణ

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం అనంత పద్మనాభ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కుంతీమాధవ స్వామి ఆలయంలోని స్వామికి మంగళవారం పవిత్రాల సమర్పణ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం నిత్య హోమం, సామాన్య హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, పురోహితులు నానాజీబాబు పాల్గొన్నారు.

ఎంపిడిఒ విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని జివిఎంసి నాలుగో వార్డు పరిధిలోని పాఠశాల, బిసి సంక్షేమ వసతి గృహం, గ్రామ సచివాలయాల్లో మంగళ వారం తనిఖీలు నిర్వహించారు. మండలంలోని సింగన బంద గ్రామ సచివాలయాన్ని ఎండిఒ ఎన్ హనుమంతరావు సందర్శించారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. పలు రికార్డులను పరిశీలించారు. జివిఎంసి నాలుగో వార్డు చేపలుప్పాడలోని బిసి సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి, అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. ఏయే సమస్యలు ఉన్నవీ అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న జివిఎంసి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు.

భూములకు పథకాలు వర్తించడం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి -ఆనందపురం : తమ పంట భూములకు ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదని బోని మాజీ సర్పంచ్ సూరాల సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామస్తులు జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. బోని గ్రామంలో సుమారు 550 కుటుంబాలు ఉన్నాయని. అందులో 200లకు పైగా కుటుంబాలు పూర్తిగా వ్యవసాయం మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని వివరించారు. ఇనాం, దేవస్థానం భూములని ప్రభుత్వం నుంచి వచ్చే అన్నదాత సుఖీభవ, పంటనష్టాలు, వ్యవసాయ కేంద్రాల ద్వారా సబ్సిడీ మీద ఇచ్చే పిచికారీ యంత్రాలు, వ్యవసాయ యంత్రాలు, పశువుల కొనుగోలుకు సబ్సిడీలు, గోకులం షెడ్లు, బ్యాంకుల వ్యవసాయ రుణాలు అందడంలేదని వివరించారు. అధికారులు పరిశీలించి రాయితీలకు అర్హత కల్పించాలని కోరారు.

ఎఐటియుసి జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముత్యమాంబ ఆటో స్టాండ్ ఆధ్వర్యాన ఆరిలోవ పినాకిల్ ఆసుపత్రి వద్ద గల ఆటో స్టాండ్‌లో మంగళవారం యూనియన్ జెండాను ఆవిష్కరించారు.

నేరాలు ఘోరాలు

3 కేజీల గంజాయి స్వాధీనం

ఇద్దరు యువకుల అరెస్టు

ప్రజాశక్తి-దేవరాపల్లి : ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్న మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు దేవరాపల్లి ఎస్ఐ టి.మల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని శ్రీరాంపురం జంక్షన్ వద్ద పోలీసులు మంగళవారం మధ్యాహ్నం వాహన తనిఖీ చేపట్టారు. విశాఖకు చెందిన తొట్ట శశి కుమార్ (21), వంగలపూడి తనూజ్ (20) వెళ్తున్న జుపిటర్ స్కూటీని తనిఖీ చేయగా, 3 కేజీలు గంజాయి పట్టుపడింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని, ఇద్దరు యువకులను అరెస్టు చేసి చోడవరం కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడలు, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలతో పాటు కెరీర్ గైడెన్స్‌పై గీతంలో ప్రత్యేక అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఇఇసిఇ విభాగం విద్యార్థులు సభ్యులుగా గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ (ఐఇఇఇ), ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ (ఐఇటిఇ) విద్యార్థి విభాగం సంయుక్తంగా మంగళవారం మిధిలాపురి పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాయి. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఇఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఐఇఇఇ విద్యార్థి విభాగం కౌన్సిలర్ డాక్టర్ మహ్మద్ కె.ఎమ్.చిష్టి, ఐఇటిఇ ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.రాజు, అధ్యాపక సహాధ్యాయులు డాక్టర్ శారద, డాక్టర్ యు.రత్నకుమారి, ఎమ్.సాహిల్, ఐఇటిఇ విద్యార్థి అధ్యక్షులు నవ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాం గ్రామంలో శ్రీ వెంకటే విద్యాపీఠ్ పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం "ఆరోగ్యవంతమైన భారతదేశం" అనే కార్యక్రమంలో భాగంగా విజన్ ట్రీ కంటి ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ మధు ఉద్దరాజు (ఎమ్ఎస్) ఆధ్వర్యాన ఉచిత కంటి పరీక్షలు చేశారు. పాఠశాలలో 350 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 11 మందికి కళ్లద్దాల అవసరమని గుర్తించారు. వీరికి విజన్ ట్రీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన ఉచితంగా కళ్లద్దాలు అందజేసినట్లు తెలిపారు. అనారోగ్యకరమైన జీవనశైలి కారకాలు మన నియంత్రణ దాటి పోతున్నందువలన విద్యార్థులలో కళ్ల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సరైన పోషకాహారం తీసుకోవడం, రెగ్యులర్‌గా కంటి పరీక్షలు చేయించుకోవాలని, కంటి చూపును మెరుగుపరిచే వ్యాయామాలు చేయాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ రొంగలి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులలో కంటి సమస్యలు వారి విద్య, అభ్యాసన సామర్థ్యాలను దెబ్బతీస్తుందని చెప్పారు. విటమిన్ ఎ, సి, జింక్, ఒమేగా 3 కలిగి ఉన్న ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కంప్యూటర్, సెల్‌ఫోన్ స్క్రీన్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పద్మ, ప్రిన్సిపల్ కుమారి సత్యవేణి పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకే స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ, తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆనుకొని ఉన్న మూడెకరాల ప్రభుత్వ స్థలాన్ని జూనియర్ కళాశాలకు కేటాయించాలని కోరుతూ స్థానిక సంఘాల నాయకులు మంగళవారం ధర్నా చేశారు. ప్రముఖ బాడ్మింటన్ క్రీడాకారిణి పివి.సింధుకు కేటాయించిన ఈ స్థలంలో జరుగుతున్న పనులను స్థానిక సంఘాల నాయకులు మంగళవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాట్లాడుతూ, పాఠశాలకు ఆనుకొని ఉన్న స్థలంలో జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలని స్థానికులు కోరిక అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ స్థలాన్ని జూనియర్ కళాశాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ బాడ్మింటన్ అకాడమీ కోసం వేరే చోట స్థలం ఇస్తే తమకు అభ్యంతరం లేదన్నారు.

టపాసులతో జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అపోలో హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ పిఆర్‌కె.ప్రసాద్ సూచించారు. అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ పండగ సమయంలో కాలిన గాయాల కేసులు అధికంగా పెరుగుతున్నాయని, తక్షణ ప్రథమ చికిత్సతో తగ్గించవచ్చని తెలిపారు.

విద్యుత్, నిత్యావసరాల ధరలపై ప్రజా పోరాటాలు

- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు
- పంచగ్రామాల సమస్య, కొండవాలు ప్రాంతాల్లో సమస్యపై తీర్మానం
- ఉత్సాహంగా గోపాలపట్నం జోన్ మహాసభ

గోపాలపట్నం జోన్ మహాసభలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి- వేపగుంట : విద్యుత్, నిత్యావసరాల ధరల పెరుగుదలపై ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. సిపిఎం గోపాలపట్నం జోన్ 9వ మహాసభలను నాయుడుతోటలోని కృష్ణాది కళ్యాణ మండపంలో నిర్వహించారు. మహా సభలు ప్రారంభ సూచికగా పార్టీ సీనియర్ నాయకులు శాస్త్రి జెండా ఎగురవేశారు. అనంతరం సీతారాం ఏచూరి, జిఎంఎస్ భాషా, పి.సత్యనారాయణ చిత్రపటాలకు పి.వెంకటరెడ్డి ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళులర్పించారు. వి.ప్రభావతి, జి.శంకరరావు అధ్యక్షతన జరిగిన సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ, ట్రూ అప్ చార్జీ పేరుతో రూ.16 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రభుత్వం వేసిందని తెలిపారు. ఇసుక కొరతతో బిల్డింగ్ కార్మికులకు పని లేకుండా చేశారని విమర్శించారు. పేదల నివాస ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్-6 పథకాలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. గత ప్రభుత్వ విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అమలు చేస్తోందని విమర్శించారు. పిపిపి పేరుతో హాస్పిటళ్లను ప్రయివేటు వారికి దారాదత్తం చేయాలని చూడడం దుర్మార్గమన్నారు. ప్రజల పక్షాన పోరాడేది సిపిఎం మాత్రమేనని తెలిపారు. ప్రజలను చైతన్యం చేసి పోరాటానికి సిద్ధంగా కావాలని కోరారు. సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, సిపిఎం పోరాట ఫలితంగా చెత్త పన్ను రద్దయిందని గుర్తుచేశారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ పాల్గొని ప్రసంగించారు.

తీర్మానాలు

పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని, కొండవాలు ప్రాంత నివాసాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, కొంతకాలంగా నివాసం ఉంటున్న పేదలకు ఇంటి పన్నులు, పట్టాలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థలు అమ్మకం ఆపాలని, అధిక ధరలను అరికట్టాలని, ఉపాధి కోసం కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు.

జోన్ కార్యదర్శిగా జగన్ ఎన్నిక

మహాసభలో సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బి.జగన్, కమిటీ సభ్యులుగా బి.రమణి, బి.వెంకటరావు, కె.వెంకటలక్ష్మి, జి.శంకరరావు, సి.హెచ్.తిరుపతిరావు, ఎస్.శంకరరావు, డి.లావణ్య, వి.ప్రభావతి, ఎస్.విజయలక్ష్మి, పి.అనసూయ, ఎం.ప్రసాద్, వి.రాజు, జక్కన సత్యనారాయణ, ఎస్.పద్మ ఎన్నికయ్యారు.

పోర్టు నిధులతోనే ఆసుపత్రిని నిర్వహించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు ఆసుపత్రిని సంస్థ సొంత నిధులతోనే అభివృద్ధి చేసి నిర్వహించాలని పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ట్రెజరర్ కోన మంగయ్యనాయుడు డిమాండ్‌చేశారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ జరగకుండా యాజమాన్యం చొరవ చూపాలని కోరారు. ఆసుపత్రి ప్రయివేటీకరణ వలంల 40 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో ఉన్న ప్రధాన రేవులలో ఆస్పత్రులను ఎక్కడా ప్రయివేటీకరణ చేయకుండా ఈ ఆసుపత్రినే చేయాలని ఆలోచన ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఆసుపత్రి ప్రయివేటీకరణ కాకుండా న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో విపిఎ బోర్డు మెంబరు కె.వీరాంజనేయరావు, ఐటిఎఫ్ ప్రతినిధి బి.వి.రత్నం, టి.భాస్కరరావు, కె.రామమూర్తి, సిఐటియు నాయకులు స్వతంత్రకుమార్, వీరరాఘవులు, జిజె. స్వామి పాల్గొన్నారు.

తమ్మినేని శివశంకర్‌ను సన్మానిస్తున్న వంశీకృష్ణ తదితరులు

తమ్మినేని శివశంకర్‌కు సన్మానం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎంఎస్ఎంఇ ఛైర్మన్‌గా నియమితులైన జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని శివశంకర్‌ను సీతంపేటలో పార్టీ కార్యాలయంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యాన దక్షిణ నియోజకవర్గ ఇంచార్జి శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో సత్కరించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, పార్టీ కోసం నిరంతరం పాటుపడిన విద్యావేత్తకు ఈ పదవి ఇవ్వడం చాలా మంచిదన్నారు. అనంతరం శివశంకర్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడితే పదవులు అవే వస్తాయన్నారు. బడుగు బలహీనవర్గాల అభివృద్ధే ఈ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుసుపులేటి ఉషాకిరణ్, జనసేన డాక్టర్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు బొడ్డేపల్లి రఘు, విశాఖ సౌత్, ఈస్ట్, నార్త్, వెస్ట్, భీమిలి, గాజువాక, పెందుర్తి, అనకాపల్లి నియోజవర్గాల నుంచి వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి పారిశుధ్య కార్మికులపై అధికారులు, రాజకీయ నాయకుల పెత్తనం పెరిగిపోతుందని, వీటిని ఆపాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కె.సుబ్బన్న కోరారు. గాజువాకలో మంగళవారం పారిశుధ్య కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారులు, నాయకుల నివాసాలలో పారిశుధ్య కార్మికులచే పనిచేయిస్తున్నారని తెలిపారు. పనిచేసే వారికంటే పెత్తనం చేసే వారు ఎక్కువగా ఉండటంతో కార్మికులపై అధిక భారం పడుతుందన్నారు. విజయవాడ ముంపు సందర్భంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో పనిచేసిన కార్మికులకు ఒక నెల జీతం ప్రోత్సాహకంగా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇస్తామన్న రెండు జతల బట్టలతో పాటు కుట్టు చార్జీలు కూడా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి సోమాదుల గణేష్, అధ్యక్షులు ఎం.సరోజిని పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణమ్మకు సన్మానం

ప్రజాశక్తి-పెందుర్తి : చోడవరం మండలం గవరవరం పిహెచ్‌సిలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేసి విరమణ పొందిన విన్నకోట లక్ష్మీ నారాయణమ్మను కొబ్బరితోట యుపిహెచ్‌సిలో డిఎంఒ శశిభూషణ్, మెడికల్ ఆఫీసర్ హర్షిత, స్థానికులు వెంకటేశ్వరరావు, జయంత్ మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, ఆమె చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. నారాయణమ్మ క్రమశిక్షణ కలిగి అంకిత భావంతో బాధ్యతలు నిర్వహించేవారన్నారు. వైద్యవృత్తి ఎంతో గొప్పదన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం జీవితాన్ని ఆమె ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ పిహెచ్‌సిలో ఆమె సేవలను వినియోగించుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు విన్నకోట రాము మాట్లాడుతూ, కరోనా సమయంలో వైద్యులు చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణమ్మ కుటుంబీకులు, బంధువులు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణమ్మ దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

ఇంటిపనివారిపై దాడి పట్ల నిరసన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇంటి పనిచేసే మహిళ కాలు విరిగేలా కొట్టిన పోలీసుల చర్యను, తప్పుడు ఫిర్యాదు చేసిన యజమాని చర్యను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం ఆక్సిజన్ టవర్స్ వద్ద ఆందోళన చేశారు. ఘటనకు సంబంధించి బాధితురాలు ఎస్.గంగ కథనం ప్రకారం... సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లో ప్రియాంక అనే ఇంటి యజమాని వద్ద గంగ వారం రోజుల క్రితం ఇంటి పని నిమిత్తం చేరింది. ఇంటి యజమాని ప్రియాంక పెట్టే ఇబ్బందులు తట్టుకోలేక పని మానేస్తున్నానని చెప్పింది. పనిచేసిన కాలానికి డబ్బులు తీసుకునేందుకు రావాలని ఇంటి యాజమాని ప్రియాంక చెప్పింది. 'అత్తయ్య ఆరోగ్యం బాగాలేదని, ఊరు వెళ్లాలని, ఇక్కడ లేనని' గంగ చెప్పింది. అనంతరం ఇంటి యజమానురాలు ప్రియాంక ఇంట్లో నల్లపూసల దండ పోయిందని ఎంవిపి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జరిగిన సంఘటనపై విచారణ జరిపించకుండా ఇద్దరు లేడీ కానిస్టేబుళ్లతో గంగను దారుణంగా కొట్టారు. కాలు విరిగేంత పనిచేశారు.

ఈ ఘటనపై గంగ బంధువులు సిఐటియు నాయకులు, స్నేహితులతో కలిసి ఆక్సిజన్ టవర్స్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో గంగ మాట్లాడుతూ, తప్పు చేయకుండా తనపై దొంగ కేసు నమోదు నమోదు చేసి చిత్రహింసలు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై దాడి చేసిన పోలీసులను, ఇంటి యాజమాని ప్రియాంకను శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. దొంగతనాన్ని ఒప్పుకోవాలని పోలీసులు తనను చితకబాదారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు మణి మాట్లాడుతూ, అమాయక ప్రజలపై ఇటువంటి కేసులు పెట్టి పోలీసులు ప్రవర్తించిన తీరు దుర్మార్గపు చర్యని ఆమె మండిపడ్డారు. గంగకు తగిన నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని, లేకుంటే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సిఐటియు నాయకులు వెంకట్రావు, బంధువులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ ఇంటిని సందర్శించిన మంత్రి కొల్లు

ప్రజాశక్తి-గోపాలపట్నం: తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీ కీర్తిశేషులు అప్పలనరసింహం ఇంటిని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం సందర్శించారు. ఆయనకు మాజీ ఎంపీ అప్పల నరసింహం కుమారుడు, స్థానిక ఎమ్మెల్యే గణబాబు స్వాగతం పలికారు. ఇంటి ప్రాంగణంలోని అప్పలనరసింహం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులతో భేటీ అయి రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించారు. మంత్రి కొల్లి రవీంద్రను ఎమ్మెల్యే గణబాబు సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్‌డిఒ తనిఖీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆర్‌డిఒ సంగీత్ మాధుర్ మంగళవారం ఎండిఒ ఎన్ హనుమంతరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు.

86వ వార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి -ఉక్కునగరం : జివిఎంసి 86 వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ గాజువాక జోనల్ కమిషనర్‌కు వార్డు సిఐటియు ప్రతినిధులు వినతిపత్రాన్ని సమర్పించారు. కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి దువ్వాడ ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, పాడైపోయిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని, మట్టి రోడ్ల స్థానంలో తారు లేదా సిమెంట్ రోడ్లు వేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించాలని, ఆటోనగర్ నుంచి వచ్చే వాహనాలను మాతృశ్రీ నగర్ బయట ఉన్న రోడ్డును పునరుద్ధరించి వాహనాలు మళ్లించాలని కోరారు. వడ్లపూడి తుంగ్లం రైల్వే గేటుపై బ్రిడ్జి పూర్తయి నాలుగేళ్లు అయినప్పటికీ ర్యాంపులు పూర్తి కాకపోవడం వల్ల ఉపయోగంలోకి రాలేదని, వెంటనే ర్యాంపులు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. చెత్త సేకరణ వాహనం ప్రతి రోజూ వచ్చేలా చూడాలని, షీలా నగర్ జంక్షన్‌లో ఏర్పాటుచేసిన లిక్కర్ షాపును జనావాసాలకు దూరంగా మార్చాలని కోరారు. స్థానికంగా ఉన్న అనేక సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాసరాజు, ఎన్.దత్తాత్రేయరాజు, రమణమూర్తి, లయన్స్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంవిఆర్‌లో రవిబాబు సంతాప సభ

ప్రజాశక్తి -గాజువాక : ఇటీవల మృతిచెందిన ఐఆర్‌టిసి రిటైర్డ్ అధికారి రవిబాబు సంతాపసభను వార్వా, నివాస్, జెవివి ఆధ్వర్యాన గాజువాకలోని డాక్టర్ ఎంవిఆర్ హాస్పిటల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సభలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, నైతిక విలువలు కలిగిన వ్యక్తి రవిబాబు అన్నారు. ఎస్ఎఫ్ఐలో పనిచేసిన ఆయన ఆశయాలను నేటి విద్యార్థులను తెలియజేయాలన్నారు. రవిబాబు సోదరుడు, వార్వా నివాస్ నాయకులు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రులకు మొత్తం ఆరుగురు సంతానంలో 5వ వ్యక్తి రవిబాబు అన్నారు. కాకినాడలో ఇంజనీరింగ్, ఖరగ్‌పూర్‌లో ఎంటెక్ పూర్తి చేసారని పేర్కొన్నారు. ఐఎఎస్ పరీక్షల్లో ఎంపికైనప్పటికీ దగ్గరగా ఉండాలని ఐఆర్‌టిసి అధికారిగా ఉద్యోగంలో చేరినట్లు తెలిపారు. రైల్వే ఉద్యోగం చేస్తూ అనేక పరిశోధనలు చేశారని, లాజిస్టిక్‌లో ఆయన పరిశోధనలను నేటికీ అమలు చేస్తున్నట్లు వివరించారు. రైల్వేలో భద్రతకు సంబంధించి చాలా పరిశోధనలు చేసినట్లు తెలిపారు. ఉద్యోగ విరమణ తర్వాత ఆర్గానిక్ వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ఎల్.కృష్ణారావు మాట్లాడుతూ, వామపక్ష ఉద్యమాలకు ఎంతో తోడున్న వ్యక్తి అని తెలిపారు. బి.వి.త్రినాథస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో వార్వా నివాస్ నాయకులు ఎస్‌వికె.పరుశురామ్, బి.గురప్ప, కె.కిరీటం, రామన్ రావు, ఐద్వా నాయకులు సంతోషం, సుభద్ర పాల్గొన్నారు. రవిబాబు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సంతాప సభలో మాట్లాడుతున్న ఎం.రాంబాబు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ధర్నా



వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-కశింకోట

పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన నిధులు విడుదల చేయాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ గత సంవత్సరం నుండి డిగ్రీ, పీజీ, బీటెక్, డిప్లమో, ఐటిఐ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన ఇవ్వలేదని తెలిపారు. దీంతో ఫీజులు కట్టడానికి కొంతమంది తల్లిదండ్రులు భూములు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు దాటినా ఈ సమస్యపై దృష్టి పెట్టలేదన్నారు. ఒకవైపు సెమిస్టర్ పరీక్షలు వస్తున్నాయని, సెమిస్టర్ ఫీజులు కట్టాలని ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ సమస్యలను పరిష్కరించకుంటే విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అర్జున్, తరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ : విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన విడుదల కాకపోవడంతో ఫీజులు కట్టలేక చదువు మధ్యలో ఆపేసే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తరుణ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి : బకాయి పడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన విడుదల చేయాలని, తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ముద్రించిన వాల్ పోస్టర్లను స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రమణ, నాయకులు కె అర్జున్, తరుణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణ మూర్తి

'ఉల్లాస్'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని ఎంపిడిఒలు, డిఆర్‌డిఎ అసిస్టెంటు ప్రోజెక్టు మేనేజర్లకు ఉల్లాస్ కార్యక్రమంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడం ప్రథమ కర్తవ్యమని చెప్పారు. డిఆర్‌డిఎ ప్రోజెక్టు అధికారి కె.శచీదేవి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంటు, క్లస్టర్ కో ఆర్డినేటర్ల సహాయంతో సర్వే నిర్వహించామని, స్వయం సహాయక సంఘాలలో గల నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి డి.చిన్నికృష్ణ, డివిజనల్ డెవలప్మెంటు అధికారి ఎస్.మంజులావాణి, వయోజన విద్య స్టాటిస్టికల్ అసిస్టెంటు పి. సూర్యారావు, జిల్లా రిసోర్స్ పర్సన్స్ పి.వెంకటరమణ, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గాంధీ నగరం ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో బీసీ వెల్ఫేర్ డిడి రాజేశ్వరి చేతుల మీదుగా విద్యార్థులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. హాస్టల్ వంటశాల, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏబిసిడబ్ల్యూఓ కె.కృష్ణారావు, హెచ్‌డబ్ల్యూఓ ఎస్ సత్యనారాయణ, నాలుగో తరగతి సిబ్బంది శ్రీను, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు సాధ్యపడుతుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి త్రో బాల్ సెలక్షన్ ట్రయల్స్ అండర్-14, అండర్-17 బాల బాలికల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుండి 450 మంది బాలబాలికలు హాజరయ్యారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం శ్రీపాద రవి, వ్యాయామ ఉపాధ్యాయుడు ధర్మిరెడ్డి రాజు, మాజీ సర్పంచ్ కే సూర్యనారాయణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు ఎం సూర్యనారాయణ, మాజీ జెడ్పిటిసి జై శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షులు బి శ్రీరామదాసు, నాయకులు ద్వారపురెడ్డి బాబ్జి, తెలుగు యువత నేత డ్రీమ్స్ నాయుడు, పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పరవాడ : ఎంపీటీసీ సింహాద్రి కంపెనీలో స్టాఫ్ ఆఫీసర్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగం చేస్తున్న రుగడ లక్ష్మి ముత్యాలమ్మపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తన సొంత నిధులతో ఫ్యాంక్స్, జామెంట్రీ బాక్స్‌లు నోట్ బుక్కు 23 మందికి అందజేశారు. అలాగే ఎన్టిపిసిలో మెయింటినెన్స్ బాయిలర్ మిల్ రిజెక్ట్‌లో పని చేస్తున్న 100 మంది కార్మికులకు తన సొంత నిధులతో డ్రెస్ మెటీరియల్ మంగళవారం అందజేశారు.

ఘనంగా పటేల్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-సబ్బవరం : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సమైక్యత దినోత్సవ ప్రతిజ్ఞను విద్యార్థుల చేత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీతాలక్ష్మి చేయించారు. అనంతరం కళాశాల నుండి సబ్బవరం ప్రధాన రహదారి వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి శంకర్, డాక్టర్ టిఎంవి నివేదిత, డాక్టర్ ఎస్. సత్యనారాయణ, ఎంవి రామకృష్ణ, ఎన్‌సిసి వాలంటీర్లు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ భవిత కేంద్రంలో ఎన్టిపిసి సింహాద్రి ఏజీఎం హెచ్ఆర్ బీబీ పాత్ర కుమారుడు సోహం పాత్ర జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవిత విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు మంగళవారం స్వీట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. వికలాంగులతో ముచ్చటించి వారితో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో బీబీ పాత్ర సతీమణి మనస్విని సాహో, కుమారుడు సోహం పాత్ర, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూరగాయల నిల్వకు కోల్డ్ స్టోరేజ్ కావాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : తమ ప్రాంతంలో ఎక్కువగా కాయగూరలు పండిస్తున్న దృష్ట్యా వాటిని నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని కాయగూరలు రైతులు అధికారులను అభ్యర్థించారు. మండలంలోని ఆర్లి, కె.సంతపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాయకూరలు, మామిడి పంట ఎక్కువగా పండిస్తున్నామని, వాటికి సరైన ధరలేని సమయంలో మార్కెట్‌కు అనుగుణంగా అమ్ముకునేందుకు ఒక కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేయాలని, వ్యవసాయ యంత్ర పనిముట్లు ఇవ్వాలని రైతులు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సోమశేఖర్, రైతులు బోలెం సత్యనారాయణ మూర్తి, బండారు దొరబాబు, బండారు రమణ పాత్రుడు, బోలెం సత్యనారాయణ, బోలెం సూర్యనారాయణ, వివిఎవ్ కుమార్, సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

పొట్టదశకు చేరిన వరికి పొటాష్ వేయాలి

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని వరి పంట పొట్టదశకు చేరిందని, రైతులంతా పొటాష్‌ను వాడి అధిక దిగుబడి సాధించాలని కొక్కిరాపల్లి పరిశోధనా కేంద్రం వ్యవసాయాధికారి కుమారి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని కట్టుపాలెం వార్డులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పొలాలను పరిశీలించి రైతులకు తగిన సూచనలిచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.మోహనరావు, వ్యవసాయ సహాయకులు దివ్య ప్రసన్న, రైతులు నీలకంఠం, రాము, బండి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టుల నవీకరణ షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి : 2025 సంవత్సరానికి ఓటరు లిస్టులు నవీకరణకు షెడ్యూలు విడుదల చేసినట్లు జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. కలెక్టరు కార్యాలయంలోని తన చాంబరులో మంగళవారం వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో డిఆర్ఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరం జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన లేదా నిండుతున్నవారు ఈ నెల 29 నుండి నవంబర్ 28 వరకు ఓటరుగా నమోదు చేసుకొనుటకు దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. నవంబర్ 9, 10, 23, 24 తేదీలను ప్రత్యేక ప్రచార రోజులుగా ప్రకటించడం జరిగిందని, ఆయా తేదీల్లో బూత్ లెవెల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. ఫారం 6 ద్వారా కొత్తగా పేరు నమోదు, ఫారం 7 ద్వారా తొలగింపులు, అభ్యంతరాలు తెలపటానికి, ఫారం 8 మార్పులకు వినియోగించుకోవాలని కోరారు. దరఖాస్తు బూత్ లెవెల్ అధికారి కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా లేదా www.voters.eci.gov.in పోర్టల్ నందు లాగిన్ అయి ఆన్‌లైన్ ఫారాలను సమర్పించవచ్చునని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి.నాయుడు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కె.హరినాథబాబు (ఆప్), బొలిశెట్టి శ్రీనివాసరావు (టిడిపి), ఎం.జానకిరామరాజు (వైసిపి), టి.రమణ (కాంగ్రెస్), అల్లు రాజు (సిపిఐఎం), పి.నాగేశ్వరరావు (బిజెపి) పాల్గొన్నారు.

అభిజిత్ కార్మికులకు న్యాయం చేయాలి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రికి సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అభిజిత్ పరిశ్రమ లే ఆఫ్ చేయడం వలన వెయ్యి కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని, వెంటనే పరిశ్రమను తెరిపించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో ఈఎస్ఐ హాస్పిటల్ శంకుస్థాపన కార్యక్రమానికి మంగళవారం విచ్చేసిన మంత్రిని సిఐటియు నాయకులు, అభిజిత్ పరిశ్రమలో ఉపాధి కోల్పోయిన కార్మికులు కలిశారు. పరిశ్రమ లే ఆఫ్ ప్రకటించడం వలన ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పరిశ్రమను తెరిపించాలని, ఉపాధి కల్పించాలని, బకాయిపడిన వేతనాలను చెల్లించాలని, బోనస్ ఇవ్వాలని కోరారు.

మంత్రికి సమస్యను తెలియజేస్తున్న సిఐటియు నేతలు

లబ్ధిదారులకు దీపం పథకం అందేలా చర్యలు

జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వం అందిస్తున్న దీపం పథకం ప్రతి లబ్దిదారునకు అందించేలా చర్యలు తీసుకోవాలని జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి కోరారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సివిల్ సప్లయి అధికారులు, గ్యాస్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అర్హులైన లబ్దిదారులకు "దీపం పథకం-2" పథకం ద్వారా ప్రతి ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 31 నుండి ఈ పథకం ప్రారంభమవుతుందని తెలిపారు. ఇందుకు ఆధార్ కార్డు నెంబరు, రేషన్ / బియ్యం కార్డు నెంబరు, ఆధార్ నెంబరుతో లింకు చేయబడిన బ్యాంకు ఖాతా (ఎకౌంటు) నెంబరు, గ్యాస్ కనెక్షన్ నెంబరు ఉన్న గ్యాస్ వినియోగదారులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. జిల్లాలో గల అన్ని గ్యాస్ కంపెనీలు ఆన్లైన్ పోర్టల్ ద్వారా లబ్దిదారుల జాబితా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీ నుండి లబ్దిదారులు తమ గ్యాస్ ఏజెన్సీలో బుక్ చేసి గ్యాస్ ధర ఏజెన్సీకి ముందుగా చెల్లిస్తే లబ్దిదారుడు అర్హులైనట్లు మొబైల్ నెంబరుకు మెసేజ్ వస్తుందని, మెసేజ్ వచ్చిన లబ్దిదారునకు చెల్లించిన మొత్తం సొమ్ము వారికి గ్యాస్ డెలివరీ అయిన 48 గంటలలోగా వారి ఆధార సంఖ్యా సంబంధిత జమ అయ్యే బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని చెప్పారు. లబ్దిదారుల సిలిండర్లు అక్రమంగా అమ్ముకాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని, ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి జాహ్నవి

జాతీయస్థాయి పోటీలకు 'ప్రతిభ' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం : జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు మండలంలోని ప్రతిభ విద్యాలయం విద్యార్థి బి. భరత వర్ధన్ ఎంపికయ్యారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో జరిగిన బాస్కెట్ బాల్ స్టేట్ మీట్‌లో భరత్ వర్ధన్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి అండర్-17 బాస్కెట్ బాల్ విభాగంలో జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వచ్చేనెలలో ఛత్తీస్‌ఘడ్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో భరత వర్ధన్ పాల్గొంటారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, ప్రిన్సిపాల్ అన్నీ జోసెఫ్, ఆదిరెడ్డి శరత్ తదితరులు భరత్ వర్ధన్‌ను, కోచ్ రాజును అభినందించారు.

భరత్‌వర్ధన్‌ను అభినందిస్తున్న దృశ్యం

మండల పరిషత్తు సమావేశం రసాభాస

గోకుల షెడ్లు మంజూరుపై నిలదీసిన వైసిపి సభ్యులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. పశువైద్యాధికారిణి కె.మంజూషరాణి అన్ని పంచాయతీల నుంచి గోకుల షెడ్లు మంజూరు కోసం 572 దరఖాస్తులు వచ్చాయని తెలియజేయగా వైసిపి సర్పంచులు బూరె బాబురావు, చింతల సత్య వెంకటరమణ జోక్యం చేసుకొని గోకుల షెడ్లు మంజూరుకు సర్పంచులకు తెలియకుండానే లబ్ధిదారులు ఎంపిక ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీంపై వైసిపి, టిడిపి సర్పంచులు, ఎంపిటీసీలు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అధికారుల వైఖరిపై వైసిపి సభ్యులు మండిపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖపై ఎంఈఓ 2 ఉషారాణి మాట్లాడుతుండగా దేవరాపల్లి ఎంపిటీసీ మొల్లి కృష్ణమూర్తి కలుగజేసుకొని ప్రైవేట్ స్కూళ్లను పర్యవేక్షిస్తున్నారా అని ప్రశ్నించారు. మండలంలో ప్రైవేట్ స్కూళ్ల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, సరిపడా వసతులు లేకున్నా విద్యా సంస్థలు నడుపుతున్నారని తెలిపారు. దీనిపై ఎంఇఓ స్పందిస్తూ ప్రైవేట్ స్కూల్ నిర్వహణలో లోపాలు ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లోని పలు సమస్యలపై సభ్యులు ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి కర్రి సత్యం, ఎంపీడీవో ఎం.సువర్ణరాజు, తహశీల్దార్ పి.లక్ష్మీదేవి, సిడిపిఓ మంగతాయారు, వ్యవసాయ అధికారిని ఎల్వి కాంతమ్మ, ఉపాధి హామీ ఏపీవో బి.చంద్రకళ, వైద్యాధికారులు పూజ్య మేఘన, బి.హారిక, విద్యుత్ శాఖ ఏఈ శంకరరావు, సర్పంచులు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.

వాగ్వివాదం చేసుకుంటున్న వైసిపి, టిడిపి సభ్యులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రం బుచ్చయ్యపేట బ్లెస్సింగ్ చర్చి ఆధ్వర్యంలో గాజువాక సిఎలెస్ మినిస్ట్రీస్ వారి ఆర్థిక సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గణేష్ విజన్ సెంటర్ వైద్య బృందం సుమారు 200 మంది రోగులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించారు. కంటి సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిషప్ సుధీర్ కె.మహంతి, వైద్యులు జామి గణేష్, ఎంపీపీ దాకారపు నాగేశ్వరిదేవి, జడ్పీటీసీ దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావు, సర్పంచ్‌లు పేదిరెడ్ల మాణిక్యం, సుంకర లక్ష్మి, సుంకర శ్రీనివాసరావు, పాస్టర్ రాజేష్ పాల్గొన్నారు. అమ్మ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు.

ప్రజల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి-కశింకోట : ప్రజల అభివృద్ధికి టిడిపి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని ఏనుగుతుని గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళికి మహిళలకు వంట గ్యాస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గొంతిని శ్రీనివాసరావు, నిమ్మదల సన్యాసినాయుడు, కర్రి సత్య నారాయణ, సిదిరెడ్డి శ్రీను, నైనముశెట్టి రమణ రావు, ఉల్లింగల రమేష్, కలిగట్ల సింహాద్రి, బలిజి ముసిలి నాయుడు, అంది రమణ పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందిస్తాం

ప్రజాశక్తి-కశింకోట : రైతులకు అవసరమైన విత్తనాలు అందిస్తామని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని అడ్డం గ్రామం మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఎమ్మెల్యే క్షేత్ర పరిశీలన చేశారు. ఎంటియు 1224 వరి వంగడాల గురించి అడిగి తెలుసుకున్నారు. రబీ సీజన్‌కి అవసరమయ్యే విత్తనాలను, ఎరువులను సమకూర్చుతామని రైతులకు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, కన్నూరు పాలెం పశు వైద్యులు వివిఎస్ దయానా, ఉద్యాన సహాయకులు బి.కిషోర్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామసభ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మూలపేట పంచాయతీ ఆవరణలో జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామసభ మంగళవారం జరిగింది. 2025-26 సంవత్సరానికి పనులు గుర్తించడంతోపాటు వ్యవసాయ అనుబంధ పనులలో భాగంగా పశువుల షెడ్లు, గడ్డి పెంపకంపై చర్చించి తీర్మానం చేసినట్లు సర్పంచ్ గంగ అప్పలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొల్లేటి గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ మొల్లేటి దేవి చంద్ర, వార్డు సభ్యులు ఆడారి సత్యనారాయణ, ఆడారి అమ్మాజీ, మొల్లేటి గోవిందరావు, కాండ్రేగుల వరలక్ష్మి, భీశెట్టి నారాయణమూర్తి, సరగడం నాగేశ్వరరావు, మెట్లు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక నాయకులు బుద్ద రాజేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మొదటి సెమిస్టర్ పరీక్షల తేదీ యూనివర్సిటీ రిలీజ్ చేశాయని, కాలేజీలు ఫీజులు కడితేనే కానీ ఎగ్జామ్ ఫీజు కట్టించుకోమని డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఫీజు రియింబర్స్మెంట్ విధానం ఇంతవరకు ప్రకటించక పోవడంతో విద్యార్థులు తల్లిదండ్రులు గందరగోళంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కష్టపడ్డ వారికి గుర్తింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి నామినేటెడ్ స్థానంలో గుర్తింపు దక్కుతుందని అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక విజయ రెసిడెన్సీలో సోమవారం రాత్రి జరిగిన తెలుగుదేశం పార్టీ బీసీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ, ఎమ్మెల్సీలు దువ్వార్పు రామారావు, వేపాడ చిరంజీవి, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, బీసీ సంఘం నాయకులు వీరంకి గురుమూర్తి, భీమరశెట్టి శ్రీనివాసరావు, గిరిజల లక్ష్మణరావు, నూకరాజు, తమ్మిన విజయ్, బిసి నాయకులు పాల్గొన్నారు.

ఎజెండా రూపకల్పనకు సభ్యులను సంప్రదించాలి

-మున్సిపల్ కౌన్సిల్‌లో డిమాండ్
-పలు ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి - యలమంచిలి

కౌన్సిల్ సమావేశాల్లో ప్రతిపాదిస్తున్న ఎజెండాలో కౌన్సిల్ సభ్యుల ప్రమేయం లేకుండా జరగడం విచారకరమని మంగళవారం జరిగిన యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో కొంత మంది సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సభ్యులను సంప్రదించాలని కోరారు. ఎజెండాను కనీసం ఒక రోజు ముందుగానైనా సభ్యులతో పాటు పాత్రికేయులకు కూడా అందిస్తే చర్చనీయాంశాలు లోతుగా పరిశీలించే అవకాశం ఉంటుందని సమావేశానికి ముందు పాత్రికేయులు కోరగా కౌన్సిల్ తీర్మానించింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ కోతుల బెడద పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ నిబంధనల ప్రకారం కోతుల్ని పట్టి అటవీ ప్రాంతాలకు తరలించే కార్యాచరణ చేపడుతున్నట్టు ప్రకటించారు. దీనికి రూ.2.73 లక్షలు కేటాయిస్తూ తీర్మానించారు. కుక్కల బెడద కూడా పట్టణంలోనూ, విలీన గ్రామాల్లో పెరిగిపోయిందని, వాటిని నియంత్రించడానికి శస్త్ర చికిత్సల నిమిత్తం ఆపరేషన్ షెడ్డు నిర్మాణానికి పశువుల ఆసుపత్రిలో రూ.2 లక్షలు కేటాయిస్తూ తీర్మానించారు. శానిటేషన్ వర్కర్లకు సబ్బులు, బట్టల సబ్బులు, నూనె ఖర్చులకు రూ.3 లక్షలు చెల్లించడానికి ఆమోదం తెలిపారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న మట్టిరోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు కోరగా అందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, కౌన్సిలర్లు, కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, డిఇఇ, ఏఇ సుబ్బారావు, ఎలక్ట్రికల్ ఏఇ, రెవెన్యూ ఆఫీసర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

బాణసంచా తయారీ, నిల్వ, విక్రయానికి అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-సబ్బవరం : బాణసంచాను అనుమతి లేకుండా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్థానిక సిఐ పిన్నింటి రమణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లైసెన్స్ కల్గిన దుకాణదారులు మాత్రమే బాణసంచా అమ్మాలన్నారు. లైసెన్స్ కల్గిన దుకాణదారులు ప్రమాదాలు నివారణ కొరకు అగ్నిమాపకశాఖ నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. జనావాసాలు, విద్యాసంస్థలు, హాస్పటల్స్‌కు దూరంగా బాణసంచా విక్రయాలు జరపాలన్నారు. దీపావళి రోజున ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్‌కు 101, పోలీస్ డయల్ 100/112లకు, లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మండలంలోని ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారం ఉంటే పోలీసులకు తెలియచేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

పరవాడ : దీపావళి సందర్భంగా అనుమతి లేకుండా అక్రమంగా బాణాసంచా నిల్వ చేయడం గాని అమ్మడం గానీ చేయరాదని సిఐ మల్లికార్జునరావు పేర్కొన్నారు. ఒకవేళ ఆ విధంగా ఎవరైనా చేసినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యవసాయ అధికారి కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి- సబ్బవరం : విజయనగరంలో వ్యవసాయ అధికారిగా పనిచేస్తూ ఈ ఏడాది ఆగష్టు 9న మృతి చెందిన ఎం.ఉమామహేశ్వరనాయుడు కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం అండగా నిలబడింది. ఉమామహేశ్వరనాయుడు భార్య కూడా మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో తల్లిదండ్రులను కోల్పోయి ఇద్దరు కుమార్తెలు అనాధలయ్యారు. వారిలో ఒకరు ఇంటర్, ఇంకొకరు పదోతరగతి చదువుతున్నారు. ఇద్దరు బాలికల చదువు, వారి ఇతర అవసరాలకు ఇబ్బంది లేకుండా రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.ప్రవీణ్ పిలుపు మేరకు రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన వ్యవసాయ అధికారులు రూ.30 లక్షలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని విశాఖ జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎస్.ఢిల్లీరావు చేతుల మీదుగా ఇద్దరు పిల్లలకు చెక్కు రూపంలో అందించినట్లు ఏపి వ్యవసాయ అధికారుల సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి పోతల సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఏపిఎఓ నాయకులు బి.విజయ ప్రసాద్, మాణిక్యాంబిక, టి.శ్రీదేవి, పాత్రుడు , శ్రీనివాస్, బి.శివకోమలి, విఠల్ కిషోర్, విజేత, శ్యాం ప్రసాద్, సురేష్, నాయక్, బాషా, శ్రీకాంత్, కమలాకర శర్మ పాల్గొన్నారు.

డైట్‌లో ఎక్స్‌ట్రీమ్ గ్లోబల్ కాంపిటీషన్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ ఎక్స్‌ట్రీమ్ గ్లోబల్ కాంపిటీషన్ ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించారు. ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ 106 విద్యార్థులు, 11 ఫాకల్టీ సభ్యులతో 49 బృందాలుగా నిర్వహించి విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కోడింగ్ కాంపిటీషన్లో పాల్గొనే అవకాశం కల్పించింది. ప్రపంచవ్యాప్తంగా 9000 వేలకు పైగా టీంలతో ఈ బృందాలు పోటీ పడతాయని ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు, కళాశాల చైర్మన్ రత్నాకర్ తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ కౌన్సిలర్, అకడమిక్ కోఆర్డినేటర్ ఏ.కృష్ణనాగ్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని ప్రభుత్వం ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు భద్రత, పెస్ట్ కంట్రోల్ కార్మికులను గుత్తేదారు వ్యవస్థను రద్దు చేసి, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్‌లో కలపాలని ఏపి మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడోట ప్రకాష్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రిలో సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం ఎస్.సంతోష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు మాదిరిగా ఆసుపత్రి కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కోన లక్ష్మణ, సత్యవతి, కిరణ్, వరప్రసాద్, చిన్న అప్పారావు, వి.అప్పలరాజు పాల్గొన్నారు.

జివిఎంసి అధికారుల తీరుపై నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్, ఎఎంహెచ్ఓ, ఎంపిడి, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ జోనల్ కార్యాలయం ముందు మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు చిన్నియాదవ్, బండి అప్పారావు, బొబ్బిలి గోవిందరాజులు, ముగడ అప్పారావు, భరిణికాన సూరిబాబు, డొక్కరి మోహన్ యాదవ్, అల్లు చిన్నారావ్, ముగడా చరణ్ రాజ్ పాల్గొన్నారు.

కబ్జాలకు గురైన చెరువులను కాపాడాలని వినతి

ప్రజాశక్తి-సబ్బవరం : కబ్జాలకు గురైన చెరువులను కాపాడాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నాయకులు స్థానిక తహశీల్దారు బి.చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. చెరువులను కాపాలని కోరుతూ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన జలవనరుల పరిరక్షణ యాత్ర మంగళవారం సబ్బవరం చేరింది. తహశీల్దారుకు వినతిపత్రం ఇచ్చిన అనంతరం సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లోని గ్రామాలలో పర్యటించి జలవనరులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అక్రమణలకు గురైన చెరువులు కాపాడాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సమితి నాయకులు గురూజీ భారతానంద మహారాజ్, దేవిపల్లి సీతారాం, ఐ.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట గవరపేటలో శ్రీగౌరీ పరమేశ్వర్ల విగ్రహం ప్రతిష్ట సోమవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, కాండ్రేగులు సతీష్, కమిటీ ప్రతి నిధులు పాల్గొన్నారు.

రీ సర్వేలో సమస్యలు పరిష్కరిస్తాం

-పలుచోట్ల రెవెన్యూ గ్రామసభలు



నక్కపల్లిలో వినతులు ఇస్తున్న రైతులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల గ్రామంలో మంగళవారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. గతంలో నిర్వహించిన రీ సర్వేలో తప్పిదాలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యలు పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు తెలియజేశారు. ఈ మేరకు పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త అల్లు రమణ, మాజీ వైస్ ఎంపిపి వైబోయిన రమణ, నాయకులు గోవింద తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం పంచాయితీ శివారు ఎ.సిరసపల్లి రెవిన్యూ గ్రామంలో మంగళవారం జరిగిన రెవిన్యూ సదస్సులో భూ రీ సర్వే సమస్యలపై 121 అర్జీలు అందినట్లు తహశీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. ఆ ఫిర్యాదులపై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి గణేష్, మండల సర్వేయర్ అప్పారావు, సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, ఎంపిటిసి రాపేటి అరుణ రాము, వీఆర్వో డి.నాగేశ్వరరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల:గత ప్రభుత్వంలో చేసిన రీ సర్వే సమస్యలను పరిష్కరించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసిల్దారు తిరుమలబాబు తెలిపారు. మంగళవారం ఆయన రామచంద్ర పాలెం, బి కె పల్లి గ్రామాలలో రైతు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా 148 రైతులు ఫిర్యాదులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రీ సర్వేలో తలెత్తిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్, ఆర్ఐ ఊర్ధవరావు, ఎంపిటిసి సభ్యులు రాంబాబు, పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

తాగునీటి పథకానికి మరమ్మతులు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలంలో కవగుంట గ్రామంలో మరమ్మతులకు గురైన మంచినీటి పథకాన్ని సర్పంచ్ దాసరి సూర్యకుమారి దగ్గరుండి పనులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారు 1500 జనాభాకు 20వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి రక్షిత పథకం ఒక్కటే వుందన్నారు.ఈ పథకం ద్వారా గ్రామం మొత్తానికి తాగు నీరు సరఫరా అవుతుందన్నారు.ట్యాంక్ కెపాసిటీ చిన్నది కావడంతో తర చూ మరమ్మతులకు గురవుతుందన్నారు. అధికారులు స్పందించి తక్షణమే నూతనంగా రక్షిత పథకం నిర్మాణం చేపట్టాలని సర్పంచ్ కోరారు.

మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్

ర్యాలీ చేపడుతున్న వైద్యులు, సిబ్బంది

వరల్డ్ స్ట్రోక్ డేపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -ఎస్ రాయవరం: మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాసంతి పర్యవేక్షణలో వరల్డ్ స్ట్రోక్ డేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరుచుకోవాలన్నారు.ఎక్కువుగా ఉప్పు, మసాలా, నూనె, నిల్వ పచ్చళ్ళు తీసుకోవద్దని తెలిపారు. ఆరోగ్య కరమైన జీవనశైలి అలవర్చుకోవడంతో ఆరోగ్యకరమైన జీవితం గడపొచ్చునని తెలిపారు. వరల్డ్ బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరరావు, పి.హెచ్.ఎన్..ఎం. రత్నసఖి, ఎఫ్.డి.పి.క్లస్టర్ పర్యవేక్షకులు డాక్టర్ ప్రసాద్, హెల్త్ సెక్రటరీ ఎం.రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎస్‌బిఐలో బీమా పథకాలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న మేనేజర్ రాజశేఖర్

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట: మండలంలో చింతపాక గ్రామం లో మంగళవారం సీతయ్యపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పలు పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ స్టేట్ బ్యాంక్ అకౌంట్ కలిగి ఉండాలన్నారు. గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం, సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు.ప్రధానమంత్రి జన ధన్ యోజన, ప్రధానమంత్రి జన సురక్ష యోజన క్రింద రూ 12- కడితే రెండు లక్షలు ఇన్సూరెన్స్ వరిస్తుందన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన 436/- కడితే రెండు లక్షల ఇన్సూరెన్స్, రూపే కార్డు ఉపయోగించడంతో మరొక 2 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ పొందవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొలజాన శ్రీను, విఓఏ రమణమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పశు వైద్యులు

పశువుల వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి -కోటవురట్ల:పాడి పశువులకు సోకే గర్భకోశ వ్యాధి నివారణ పట్ల మంగళవారం ఆక్సాహెబ్ పేట గ్రామంలో స్థానిక సర్పంచ్ దుర్గ, ఎంపిటిసి సభ్యులు శ్రీను ఆధ్వర్యంలో పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్, పాములవాక పశు వైద్యాధికారిణి హరిప్రియ ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు, ఈ సందర్భంగా 67 ఎదకురాని పశువులను గుర్తించి వైద్యం అందజేశారు. గర్భకోస వ్యాధి నివారణ పై రైతులకు అవగాహన కల్పించారు. దూడలకు నట్టల నివారణ మందు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్.పురంలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురంలో మండల వ్యవసాయాధికారి సుధారాణి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోచల సుజాత, లింగంధొరపాలెం మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ, ఆత్మ బిటిఎమ్ లక్ష్మి, కిషోర్ పలువురు రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఒ

ఘనంగా ధన్వంతరి జయంతి

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ ఆయుర్వేద ఆసుపత్రిలో మంగళవారం ఆయుర్వేద మూల పురుషుడు ధన్వంతరి జయంతిని ఘనంగా నిర్వహించారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా శ్రీ ప్రకాష్ ఆయుష్ చారిటబుల్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ సిహెచ్.వి.కె. నరసింహారావు, రామసీత దంపతులు ధన్వంతరి హోమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు ప్రసాద్, ఎల్.యన్.శాస్త్రి లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, సమీరా దంపతులు, శ్రీ ప్రకాష్ ఆయుష్ చారిటబుల్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ అడ్వైసర్ అలపాటి రాజేంద్రప్రసాద్, ఆయుర్వేద చికిత్సాలయం ప్రధాన వైద్యులు రమేష్ బాబు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రిలో మంగళవారం ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీవిఎన్ బినయ్ కుమార్ ఆధ్వర్యంలో ముందుగా ఆయుర్వేద పితామహుడు ధన్వంతరీ జయంతి నిర్వ హించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సులభమైన పనులకు భారీ బహుమతులు, మీ పేరుతో క్రెడిట్ కార్డు జారీ చేయబడిందని, పొరపాటున డబ్బు బదిలీ జరిగిందని, కేవైసీ గడువు ముగిసిందని, ఇలా పలు రకాలుగా సైబర్ నేరగాళ్ళు ప్రజలను మోసపూరిత మాటలతో నమ్మబలికి అకౌంట్లో డబ్బులు కాజేసేస్తు న్నారన్నారు. ప్రజలంతా ఈ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింక్స్ లేదా అటాచ్మెంట్స్ ఓపెన్ చెయ్యవద్దన్నారు.లింక్ లు ద్వారా డబ్బులు ఎవరికి బదిలీ చేయవద్దన్నారు.గుర్తు తెలియని వ్యక్తులతో పరిమితంగా సంభాషణలు చెయ్యాల న్నారు..సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930,లేదా స్థానిక పోలీస్ స్టేషన్ లో గాని పిర్యాదు చేయాలన్నారు.

అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

ఆకుకూరలతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి -నక్కపల్లి:మునగాకు వాడటంతో రక్తహీనత దూరం అవుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత, అంగన్వాడీ టీచర్లు అన్నారు. నక్కపల్లి లో మంగళవారం వీవర్స్ కాలనీ, కొత్తపేట, శెట్టిబలిజపేట అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణి స్త్రీలకు, బాలింతలకు, కిశోర బాలికలకు మునగాకు వాడడంతో కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత లోపించిన వారందరూ మునగాకు వాడటంతో రక్తహీనత నుండి బయటపడతారన్నారు. మునగాకులో అనేక పోషక విలువలు ఉన్నాయన్నారు. మునగాకు, తెలగపిండి తో వంటకాన్ని తయారు చేసి ప్రదర్శించారు. ఆకుకూరలు తినడంతో మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న తహశీల్దార్

ఉచిత ఇసుక ప్రారంభం

ప్రజాశక్తి -కోటవురట్ల: ఉచిత ఇసుక కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక తహసిల్దారు తిరుమలబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జిపిఎస్ ద్వారా గుర్తించిన వాహనాలకు నిర్దేశించిన ప్రదేశానికి ఇసుకను తరలించుకునే అవకాశం ఇస్తున్నామన్నారు. మండలంలో కైలాస పట్నం, గొట్టువాడ, పందూరు గ్రామాల్లో ఇసుకను తీసుకునేందుకు అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. వంతెనలకు, బోరు బావులకు 50 మీటర్ల దూరంలో మాత్రమే తవ్వకాలు చేపట్టాలన్నారు, నిర్దేశించిన గ్రామాలలో ఎవరైనా పాటలు నిర్వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా రాత్రి సమయంలో ఇసుకను రవాణా చేసినట్లయితే ఆ వాహనాలను సీజ్ చేయబడతాయన్నారు. అక్రమంగా ఉచిత ఇసుకను వినియోగిస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని ఈ సందర్భంగా అన్నారు.

స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి పిల్లలను ఎక్కించొద్దు: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో ఒక ప్రైవేట్ స్కూల్ బస్ పరిమితి కి మించి విద్యార్థులను ఎక్కించి రాకపోకలు సాగిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం బాలాజీ అన్నారు. స్కూల్ బస్సులో పరిమితికి మించి విద్యార్థులు ఎక్కించడంతో అడ్డుకున్నారు. స్కూల్ బస్సులో సుమారుగా 70 మంది పిల్లలను ఎక్కించుకోవడంతో , విద్యార్థులు ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. పరిమితి మేరకే స్కూల్ పిల్లలను బస్సులో ఎక్కించుకోవాలని డిమాండ్ చేశారు.

సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ

సామాజిక తనిఖీల్లో నిర్లక్ష్యంపై ఆగ్రహం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ కార్యక్రమం పై పిడి పూర్ణిమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన 15 రోజులుగా సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన తనిఖీలను వెల్లడించింది. కనీసం కూలీల హాజరు పత్రాలను కూడా పరిశీలించరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గ్రామాలలో వాలంటీర్లకు ఉపాధి కూలీ కల్పించడం, ఇంటి నిర్మాణాలకు రెండు అంతస్తులు నిర్మించుకున్న వాటికి కూడా బిల్లులు చెల్లించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో పలువురు నాయకులు ఉపాధి పనులపై చూపుతున్న నిర్లక్ష్యం పట్ల అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. చనిపోయిన వ్యక్తులు మస్తర్లు వేస్తున్న విషయాన్ని, పనులకు హాజరు కాకుండా వేతనాలు తీసుకుంటున్న విషయాన్ని సభ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఏపీవో గంగు నాయుడు, నాగరాజు, పలువురు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థానం భూముల వేలంపాట ఖరారు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన శ్రీ కేశవస్వామి దేవస్థానం భూము లు వేలం పాట ఖరారైంది. మంగళవారం దేవాలయం ఆవరణలో దేవస్థానం అధికారులు, గ్రామ నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ దేవస్థానం కు సంబంధించి సర్వే నెంబర్ 165 లో సుమారు 12.08 ఎకరాలు మెట్ట భూమికి అరేళ్ల కాలపరిమితి తో వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో 28 మంది హాజరుకాగా, వీరిలో ఆరుగురు మాత్రమే రూ 50 వేలు దరావత్తు చెల్లించారు. వీరు మాత్రమే వేలం పాటలో పాల్గొన్నారు. ఈ పాటలో హెచ్చు పాట దారుడుగా నర్సీపట్నం కు చెందిన కర్రి రమణబాబు ఏడాదికి రూ ఒక లక్ష 47 వేలకు కైవసం చేసుకున్నారు. గత ఏడాది పాటతో పోలిస్తే ఏడాదికి 21,800 అదనంగా పెరిగింది. మరో మూడు సంవత్సరాలు తరువాత 30 శాతం అదనపు సొమ్ముతో సాగు చేసుకోవడానికి అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ కిరణ్మయి, చోడవరం దేవస్థానంల ఈఓ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

'మూర్తి యాదవ్ బ్లాక్ మెయిలర్'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ బ్లాక్ మెయిలింగ్ కోసమే ప్రెస్‌మీట్లు పెడుతూ బెదిరిస్తూ ఉంటారని, తన పరువు ప్రతిష్టను దెబ్బతీస్తూ.. అవాస్తవమైన ఆరోపణలు చేస్తున్న ఆయనపై చట్టపరంగా పరువు నష్టం దావా వేస్తానని జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ హెచ్చరించారు. మంగళవారం మేఘాలయ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలాకాలం నుంచి పీతల మూర్తి యాదవ్ అందరిపై అవాస్తవాలతో కూడిన ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు ఆళ్ల కృష్ణ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి -పాడేరు:నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రోహిణి పేర్కొన్నారు. పాడేరు డివిజన్ పరిధిలోని మాస్టర్ ట్రైనీలకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ, స్కిల్ సెన్సెస్ సర్వే ఇప్పటికే గుంటూరు జిల్లాలో పూర్తి చేయడం జరిగిందని వివరించారు. ఇందులో భాగంగా జిల్లాలో సర్వే చేబట్టే ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఒక్కో క్లస్టర్కు ఒక ఎన్యుమరేటర్ను నియమించి సర్వే నిర్వహించబడుతుందని తెలిపారు.

వైసిపి హయాంలో మైనింగ్ దోపిడీ

-రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:గత వైసిపి పాలకులు మైనింగ్‌ను మాఫియాగా చేసి పెద్ద ఎత్తున నిధులు దోచుకున్నారని రాష్ట్ర గనులు,భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల మైనింగ్ అధికారులు, యజమానులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పాలకులు భూ ఆక్రమణలకు, దౌర్జన్యాలు దాడులతో పరిశ్రమలను దెబ్బతీశారన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక వ్యవస్థను మొత్తం నాశనం చేశారన్నారు. అటువంటి కష్టాల నుంచి ప్రజలను తమ తాము కాపాడుకోవాలని లక్ష్యంతో కూటమిని భారీ మెజారిటీతో గెలిపించారని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవలసిన బాధ్యత తమపై ఉందన్నారు. గతంలో 80 శాతానికి పైగా పూర్తి చేసిన పోలవరం ప్రాజెక్టును చేయకుండా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే పోలవరానికి కేంద్రం నుంచి రూ.12 వేల కోట్లు తీసుకురావడం జరిగిందన్నారు. నాలుగు నెలల పాలనలోనే అనేక మహోన్నత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రతి రంగంలోనూ వాస్తవాలను ప్రజలకు తెలియచేయాలని లక్ష్యంతో శ్వేతపత్రాన్ని విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఉచితంగా ఇసుక అందించి తీరుతామనే మాటకు కట్టుబడి ఉండి, అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిర్మాణ రంగాన్ని బలోపేతం చేయడం కోసం ఉచితంగా ఇసుక అందించడమే కాకుండా, సీనరేజీ, జిఎస్టి కూడా ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గత ముఖ్యమంత్రి జగన్ కారణంగా కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇసుక తవ్వకాలకు కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నామన్నారు. ఉన్నంత మేరకు ప్రజలకు ఉచితంగా అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. బోర్డు మెన్ అసోసియేషన్ల ద్వారా కూడా ఇసుకను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. సొంత వాహనాల్లో ఇసుక తీసుకెళ్లే వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. రవాణా చార్జీలు లోడింగ్ చార్జీలు చెల్లించి లారీల ద్వారా కూడా తీసుకెళ్లేందుకు అనుమతించామని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలి గోవింద సత్యనారాయణ, దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

పారదర్శకంగా నర్సింగ్ స్కూల్ సీట్ల ఎంపిక

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న ఆరు ప్రధాన ప్రభుత్వ నర్సింగ్ స్కూల్లో ఉచిత సీట్లను ధృవీకరించటమే కాకుండా,అభ్యర్థుల మెరిట్ జాబితాను ఎక్కడా ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా చేపట్టామని కమిటి ఛైర్మన్, కెజిహెచ్ సూపరిండింటెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. మంగళవారం కెజిహెచ్ సమావేశ మందిరంలో ఆరు నర్సింగ్ స్కూల్స్ కు సంబంధించి 310 సీట్లు భర్తీ విషయంపై అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆరు నర్సింగ్ కాలేజీల నర్సింగ్ సూపరిండింటెంట్లు, కాలేజీ ప్రిన్సిపాల్స్ సమక్షంలో ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించినట్లు తెలిపారు. కెజిహెచ్ నర్సింగ్ స్కూల్‌కు 60 సీట్లు, కాకినాడ స్కూల్ కు 50 సీట్లు, గుంటూరు కి 60, విజయవాడకి 30, ఒంగోలుకి సీట్లు, ఏలూరు స్కూల్ ఆఫ్ నర్సింగ్ కి 50 సీట్లుకు సంబంధించి ప్రక్రియను పూర్తి చేశారు. దరఖాస్తుల్లో వచ్చిన మెరిట్ జాబితా ప్రకారం ఆయా విద్యార్థులకు సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎ.ఎస్.లావణ్యకుమారి, గుంటూరు డిప్యూటీ సూపరిండింటెంట్ డాక్టర్ బి.రమేష్ కుమార్, విజయవాడ సూపరిండింటెంట్ డి.వెంకటేశ్వరరావు, ఒంగోలు ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.ప్రభాకర్,ఏలూరు ఆసుపత్రి సూపరింటెండెంట్ సిహెచ్.సుధాకర్, సభ్యులు సిహెచ్. రాజకుమారి, పి.ఆశాదేవి. కె.సుజాతరాణి, ఎ.వి.ఎంనాగేశ్వరరావు, ఎస్.వి వరలక్ష్మీ, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పవన్, అనితతో సర్పంచ్ లింగన్ననాయుడు

పవన్, అనితలను కలిసిన సర్పంచ్

ప్రజాశక్తి -కోటవురట్ల:పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను, హోంశాఖ మంత్రి అనితలను మంగళవారం బికెపల్లి సర్పంచ్ లింగన్న నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ సమస్యలను వివరించినట్లు తెలిపారు. ప్రధానంగా పారిశుధ్యం, రహదారులు, కల్వర్టు, రైతు సమస్యలను వివరించానని తెలిపారు. అదేవిధంగా శిథిలావస్థకు చేరుకున్న రామాలయంపై ప్రస్తావించామని సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు కు చర్యలు చేపడతామని వెల్లడించినట్లు తెలిపారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి -కొత్తకోట:ఎటువంటి అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయించినా, తయారు చేసిన, నిల్వ ఉంచిన అటువంటి వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని కొత్తకోట సిఐ జి. కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, జనవాసాల మధ్య మందుగుండు సామగ్రి అమ్మరాదని, ఊరికి దూరంగా విక్రయాలు జరపాలన్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన నియమ నిబంధనలు పై సర్కిల్ పరిధిలో నాలుగు పోలీస్ స్టేషన్ ల ఎస్సైలకు ఆదేశాలు జారీ చేశామని సిఐ పేర్కొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన పల్లె పండగ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా రోడ్లు, కాలువలు వంటి 85 పనులకు అధికారులు, నాయకులు భూమి పూజ కార్యక్రమం తో శ్రీకారం చుట్టారు.సంక్రాంతి నాటికి పనులు అన్ని పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించడంతో గ్రామీణ ప్రాంతాల్లో పనులు జోరుగా సాగుతున్నాయి. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పనులకు ఎంపీడీవో ఎం ఓ యు పత్రాలు అందించి ధ్రువీకరిస్తున్నారు. పల్లె పండగ లో భాగంగా మండల వ్యాప్తంగా 1.88 కోట్లతో పనులు జరుగుతున్నట్లు పంచాయతీరాజ్ ఇంజనీరు వర్మ తెలిపారు.

సీతారామరాజు నగర్‌లో నిర్మించిన రోడ్డు

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని రాప పంచాయితీ కోటగరువు గ్రామంలో ఎంపీపీ రాజుబాబు, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, రాప ఎంపీటీసీ కోరాబు నాగలక్ష్మీలు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, 15 వ ఆర్థిక సంఘం నిధుల నుండి రూ 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేయడం జరుగు తుందన్నారు. త్వరగా సిసి రోడ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -ఎస్ రాయవరం:జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో రాయవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయినట్లు వ్యాయామోపాధ్యాయుడు కె శ్రీనువాసరావు తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన స్థానిక విలేఖరులకు ఇచ్చిన సమాచారం మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో ఆటల పోటీలు దేవరాపల్లి, అనకాపల్లిలో జరిగాయన్నారు. సెపక్ తక్రా గేమ్ అండర్ 14 విభాగంలో టి ఎన్ ఎన్ దుర్గ, అండర్ 17 విభాగంలో కె ఫణీంద్ర లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపికపట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యమ్ యస్ సత్యన్నారాయణ, వ్యాయామోపాధ్యాయుడు శ్రీనువాసరావు, పాఠశాల ఛైర్మన్ ప్రసాద్, వైస్ ఛైర్మన్ అనిత అభినందనలు తెలిపారు.

ఎస్ రాయవరం :మండలంలో గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న జంప తేజ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కేరమ్స్ అండర్ 14 విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పి.డి. కుందూరు రాజు తెలియజేసారు. మంగళవారం ఉదయం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి కి ఎంపికైన తేజను పలువురు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో సైతం ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి అర్హత సాధించాలని పలువురు ఆకాంక్షించారు. విద్యార్థికి తర్ఫీదు నిచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు ను హెచ్.ఎం.నాగన్న దొర, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థులతో ఉపాధ్యాయుడు